



# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



# 20
# పరభాగ్యోప జీవి – డాక్టరేట్ పట్టా

అసలేం జరిగిందంటే కొన్నేళ్ళక్రితం గుంటూరులో ఉన్న నాగార్జున యూనివర్సిటీ విద్యార్ధి ఒకతను ఎలాగో అలా నన్ను పట్టుకుని అమెరికా తెలుగు కథ మీద తను పరిశోధన చేసి డాక్టరేట్ చేద్దామని అనుకుంటున్నాను అనీ, అందుకు నా సహాయం కావాలనీ అడిగాడు. "ఓహో అమెరికాలో అడుగుపెట్టడానికి ఇదొక సరికొత్త మార్గం. ఇది ఆ కొలంబస్ మహాశయుడికి కూడా తట్టి ఉండదు కదా" అని నేను కడుంగడు సంతసించి అతణ్ణి నిర్దాక్షిణ్యంగా అన్ని విధాలుగానూ అవతలికి గెంటేసి చాలా మంది లాగా నా అమెరికా "పొగరు" ప్రదర్శించుకున్నాను నా గాఢ మిత్రులూ– గూఢ శత్రువుల తరహాలో.. అంటే అతని ఈ——మెయిల్స్ అన్నీ డిలీట్ చేసి పారేశాను. కానీ నేను ఒకసారి హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఆతను స్వస్థలం తెనాలి నుంచి వచ్చి, నేనున్న హోటల్ లో నన్ను పట్టుకుని, మొత్తం విషయం పదే, పదే చెప్పి, నా సహాయం ఉంటే తప్ప వాళ్ళావిడ నుంచి విడాకులు తప్పవు అనే స్థాయిలో నొక్కి వక్కాణించి నన్ను ఒప్పించాడు. పెళ్ళీ, పెటాకులూ అయిపోయి, తెలుగు సాహిత్యంలో ఏదో ఒక కృషి చేసి బతుకు బాట వేసుకుందామనుకునే అతని అమాయకత్వానికి అదోలా అనిపించింది. ఇలాంటి తెలుగు భాషాభిమానులని వెర్రి వెధవలుగా పరిగణించి, తెలుగు భాషనీ, సాహిత్యాన్నీ అట్టడుగు స్థాయికి నొక్కేసి, ఆ సమాధుల మీద అమెరికా పునాదులు వేస్తున్న రాజకీయ, వ్యాపార దౌర్భాగ్యుల మీద "కసి" తో "తెలుగు సాహిత్యాభిమానం అక్కడ ఉన్నా, లేక పోయినా ఇక్కడ ఉంది" అని ఆ తరువాత నాలుగేళ్ల లోనూ నేను అతనికి నా దగ్గర ఉన్న అమెరికా తెలుగు కథలు, సమాచారమూ, సలహాలు, సూచనలు, అసలు ఈ అమెరికా తెలుగు కథని ఎలా విశ్లేషిస్తే బావుంటుందీ వగైరా అన్ని విషయాల లోనూ ఒక "గైడ్" గా వ్యవహరించాను. నేను నా చిన్నప్పుడు బొంబాయి ఐ.ఐ.టి. లో మేష్టారు గా ఉన్నప్పుడు చాలా మంది విద్యార్దులకి "థీసిస్ గైడ్" పని చేసిన అనుభవం ఇక్కడ బాగా పనికొచ్చింది కానీ ఈ సబ్జెక్ట్ వేరు, స్థాయి వేరు ..అంతకంటా కష్టమైనది అన్నీ ఫోన్ లోనూ, ఈ– మెయిల్స్ లోనూ మాత్రమే చెయ్యగలగడం. మొత్తానికి ఆ యువకుడు ఎంతో చిత్త శుద్ధితో నాలుగేళ్ళు పని చేసి ఐదేళ్ళ క్రితం "అమెరికాలో తెలుగు కథా సాహిత్యం –ఒక సమగ్ర పరిశీలన" అనే సిద్దాంత గ్రంధానికి డాక్టరేట్ పట్టా సాధించి, కృతజ్ఞతా భావంతో అతని థీసిస్ ని "వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా" కి అంకితం ఇచ్చాడు ...అంటే నాకు అనే నేను అనుకుంటున్నాను... రెండు, మూడు నెలలలో, కొత్త కథలు కొన్ని కలిపి ఈ సిద్దాంత గ్రంధం ఆధారంగా నా సొంత పైత్యం కూడా కొంత కలిపి ఒక బృహత్ గ్రంధం ప్రచురించే ప్రయత్నంలో ఉన్నాను.

ఈ "సుత్తి" అంతా ఇప్పుడు ఎందుకు గుర్తుకు వచ్చి సొంత డబ్బా కొట్టుకునే అవకాశం ఎందుకు వచ్చిందంటే,.....ఓ వారం క్రితం ఆత్మీయుడు, మంచి కథకుడు అయిన దంతుర్తి శర్మ అనే అమెరికా కథకుడు ..నాకు ఒక మెయిల్ పంపించి అందులో ఆయనకి వచ్చిన ఒక "పరిశోధనా పత్రం" కాపీ పెట్టాడు. అది చూడగానే నాకు దాని పుట్టుపూర్వోత్తరాలు అన్నీ గుర్తుకు వచ్చాయి. ఎందుకంటే, రెండు, మూడేళ్ళ క్రితం ఒక యువకుడు ...సరిగ్గా ...పైన ఉదాహరించిన మంచి యువకుడి లాగానే నన్ను ఈ- మెయిల్ లో పలకరించి సరిగ్గా అదే విధంగా అమెరికా తెలుగు సాహిత్యం మీద ప్రపంచంలో ఎవరు చేయని విధంగా తను పరిశోధన చెయ్యదల్చుకుని హైదరాబాద్ లో కేంద్ర విశ్వ విద్యాలయంలో చేరాను అనీ, అందుకు నా సహాయం కావాలనే అడిగాడు. ఎటొచ్చీ అందులో అధిక భాగం "నువ్వు అప్పుడే ఎక్కడో గుంటూరు వాడికి సాయం చేసావు కదా. నేనూ, మా గైడ్ గారూ కూడా మన కాకినాడ వాళ్ళమే కాబట్టి ఎవడికోసం చేస్తావు " అనే ధ్వని ఎక్కువగా ఉంది. అదియునూ కాక, ఇతను తన పరిశోధన కోసం కథల కాపీలు, మా కథానికా సంకలనాలూ మొదలైన ముడి సరుకు అడగ లేదు సరి కదా... అవి అక్కర లేదు కానీ ...అమెరికాలో ఆ సబ్జెక్ట్ మీద వచ్చిన వ్యాసాలన్నీ సంకలనం చేసి తనకి పంపించమని అడిగాడు. ఆ తరువాత పోనీ కదా అని ఇక్కడి నుంచి మోసుకెళ్ళి చాలా పుస్తకాలు అతనికి హైదరాబాద్ లో అందజేశాను. అప్పుడే తెనాలి యువకుడు చేసిన థీసిస్ గురించి చెప్పి, అతని సలహాలు, అతని దగ్గర ఉన్న సమాచారం కూడా తీసుకోమని చెప్పాను. దేనికీ సరి అయిన స్పందన లేక పోవడం, ఆరేడు నెలలకి ఒక సారి నా పుస్తకాలలో ఉన్న అమెరికా వారి ఈ-మెయిల్స్ అన్నింటికీ ఏదో ఒక ఉత్తరం పంపించి హడావుడి చెయ్యడం చూస్తే ఇతను డాక్టరేట్ చేస్తున్నట్టు భ్రమలో ఉండి, అందరినీ అదే భ్రమలో పెడుతున్నాడేమో, అసలు వ్యాపకం మరేమన్నా ఉందేమో అని భలే అనుమానం వేస్తోంది. హఠాత్తుగా ఇప్పుడు దివి నుంచి దిగి వచ్చిన ఈ "క్వొస్చెన్ పేపర్" నాకు లీక్ అవడంతో ఇప్పుడు అర్థం అయింది అతని అసలు పేరు "పరభాగ్యోప జీవి" అని. ఎందుకంటే తను ఏమీ నిజమైన పరిశోధన చేసి టైం వేస్ట్ చేసుకోకుండా...ఇతరులు చేసిన పరిశోధనలు, వారి అభిప్రాయాలు సేకరించి పబ్బం గడిపేద్దాం అని అనుకుంటున్నాడేమో అని కూడా నా అనుమానం.

నిజానికి అవన్నీ మనకెందుకూ, ఎవరి "డాక్టరేట్ ఖర్మానికి" వారే పాత్రులు కానీ, ఇప్పుడు బహుశా అమెరికాలో చాలా మందికీ వచ్చి, నాకు డైరెక్ట్ గా రాని ఆ "పరిశోధనా పత్రం" లో ఉన్న ప్రశ్నలకీ, అమెరికాలో తెలుగు సాహిత్యం మీద పరిశోధనకీ ఎక్కువగా లంకె కుదరక అందులో ఉన్న కొన్ని ప్రశ్నలకి నేను పంపించదల్చుకున్న సరదా సమాధానాలు ఈ క్రింద ఇస్తున్నాను. నవ్వితే నవ్వుకోండి. లేక పోతే మా ఇద్దరి మీదా జాలి పడండి. ఇందులో ముందు ప్రశ్న, *ఆ తరువాత ఇటాలిక్స్ ..అంటే కుడిపక్కకి వాలిపోయిన అక్షరాలతో క్రింద గీత గీయబడిన వాక్యాలు నేను వ్రాసుకున్న సరదా సమాధానాలు అని గమనించగలరు.*

"పరభాగ్యోప జీవి పంపిస్తున్న ప్రశ్నా పత్రం"

(వారం రోజులలోగా సమాధానాలు రాకపోతే తస్మాత్ జాగ్రత్త)

ఈ ప్రశ్నల పట్టిక అమెరికాలో ఉన్న ప్రవాసాంధ్రుల అనుభవాల గురించి, వారు రాసే సాహిత్యం గురించి, వారి అభిప్రాయాలను సేకరించడం కొరకు చేయబడుతున్న ప్రయత్నం. ఇచ్చిన జవాబులను ముఖ్యంగా పరిశోధన కొరకు, విశ్వవిద్యాలయం అధ్యయనం కొరకు ఉపయోగింపబడును. ఇచ్చిన జవాబులను అతిరహస్యంగా ఉంచడమే కాకుండా వేరొక ఉద్దేశం కోసం ఉపయోగించినప్పుడు తప్పనిసరిగాదానిని నేను అంగీకరిస్తాను. దానికి తగ్గ జవాబును తెలుపుతాను.

*--------వేరొక ఉద్దేశ్యం అనడంలో మీ ఉదేశ్యం నాకు తెలియడం లేదు. అసలు దేనికి అంగీకరిస్తారు మహాశయా? తగిన "జవాబు" అంటే కొంప తీసి మా అమెరికా రచయితలకు తగిన బుద్ది చెప్పే ఆలోచనలో ఉన్నారా?*

ఈ క్రింది ఇవ్వబడిన ప్రశ్నలను బాగా చదివి అర్థం చేసుకొని వివరంగా, నిజయితీగా జవాబు చేయగలరు. అంతేకాక మీ అభిప్రాయాలను ఈ ప్రశ్నా పట్టికకు సంబంధించి మాతో పంచుకోగలరు. మీకు ఇష్టంలేని ప్రశ్నలు ఉంటే వాటిని వదిలేసి మిగతా వాటికి సమాధానాలు రాయగలరు. నా పరిశోధనకు సహకరించగలరు. మీరు ఖాళీ లేకుండా ఉంటారని విన్నాను. నా కోసం మీరు కొంత సమయం కేటాయించి, నన్ను మన్నించి దయచేసి తెలపగలరు.

- *ఇంకా నయం. "మీరు పనీ, పాటూ లేకుండా పడి ఉంటారు" అని అని అన లేదు. పైగా మరీ నిజాయితీ గా చెప్పమని నిలదీస్తే ఎలా? అస్తమానూ నిజం చెప్పడానికి మాదేమైనా ఆంధ్రప్రదేశా, హమేశా సచ్ బోల్దానికి తెలంగాణాయా ?*

నాది తూర్పు గోదావరి జిల్లా కాకినాడ. నా పరిశోధన బాగా సాగించాలనే తపనతో ఉన్నాను. నేను చాల వరకు పరిశోధన చేసాను. అయితే అమెరికా తెలుగు కథలు – కథకుల పరిచయం కూడా ఒక అధ్యాయంగా రాస్తున్నాను. మీరు తెలుగులో రాయగలిగితే తెలుగులో రాయండి. రాయలేక పోతే తెలుగులో రాసి స్కాన్ చేసి పంపగలరు. నా మెయిల్ parabhaagyopajeevi@gmail.com. మీకు నమ్మకం లేకపోతే నా Id కార్డు పంపిస్తాను.

*–మీరు చీటికీ మాటికీ పరిశోధన చేశాను అంటే భయం వేస్తోంది సార్...దేని మీద మీ పరిశోధన చేశారు? మధ్యలో మా అమెరికా కథకులు చేసిన పాపమ ఏమిటీ? అన్నట్టు మేము రాసేదే తెలుగులో...తెలుగులో రాయగలిగితే అంటారు ఏమిటీ? ఇదేనా మీ పరిశోధన లో తేలిన అంశం ? వద్దు. మీ ఆధార్ కార్డు, రేషన్ కార్డు చూసే ధైర్యం నాకు లేదు. కెసిఆర్ గారికి ఇవ్వండి. కాకినాడ బదులు కరీం నగర్ అని మార్చగలిగితే మీకు ఫీజు రీఇంబర్స్మెంట్ దక్కుతుంది.*

1. మీరు ఎప్పుడు ఎక్కడ పుట్టారు ? మీ పూర్తి పేరు, మీ కలం పేరు, మీ తల్లిదండ్రుల పేర్లు రాయండి ?

   *–ఇందులో మా అమ్మా, నాన్నలని లాగకండి ప్లీజ్.. కావాలంటే మీ మమ్మీ, డాడీల పేర్లు బాహాటంగా ప్రకటించండి.*

2. మీ విద్యాభ్యాసం గురించి తెలపండి?

   *-----తెలుపుతాను.....అభ్యాసం పూర్తయ్యాక ...మరో పదేళ్ళు ఆగండి.... ఇంతకీ మన సంగతి ఏమిటీ? అక్షరాభ్యాసం అయిందా?*

3. అమెరికాలో ఏ ప్రదేశంలో నివసిస్తున్నారు ?(అమెరికాకు ఎప్పుడు వెళ్లారు, ప్రస్తుత నివాసం)

*–ఆముదాల వలస...లాంటి ఊరు.....ఆ రాష్ట్రం పేరు నేను తెలుగులో రాయ లేను. ఇంగ్లీషులో మీరు పలక లేరు. ఎందుకొచ్చిన గొడవ? ఇక నేను అమెరికాకి వచ్చినప్పుడు తమకి పుట్టగతులు లేవు. తమ పరిశోధనకి అది అవసరమా?*

4. వివాహం గురించి తెలపండి ?(మీ భార్యగారి పేరు పిల్లల గురించి)

   *––ఓరి నాయనోయ్ ! నా కొంప కొల్లేరే!*

5. సాహిత్యరంగ ప్రవేశం గురించి, మీ మొదటి కథ గురించి తెలపండి ?

   *–––ఏం తెలుప మంటారు? ఏదో అప్పుడెప్పుడో చేసిన బుద్ధి తక్కువ పనికి ఇప్పుడు శిక్ష వేస్తారా ? ఊహూ..కుదరదు.*

6. మీ ఉద్యోగం గురించి తెలపండి ?(మీరు పడ్డ ఇబ్బందులు)

   *––––"పడ్డ ఇబ్బందులు" ఏమిటీ తమరి మొహం? వ్యాకరణ దోషం....."పడుతున్న" అని ఉండాలి. అది సరి చేసి ప్రశ్నాపత్రం మళ్ళీ పంపించండి. అప్పుడు చూద్దాం.*

7. మీరు రాసిన పుస్తకాల పేర్లు, మీరు రాసిన రచనల సూచి రాయండి?

   *–––ఇప్పటి దాకా మీకు అవి తెలియక పోతే, ఇక మీరు చేసిన పరిశోధన ఏమిటీ నా పిండాకూడు?*

8. మీ వలసకు గల కారణాలు ?

   *––––––––మీ లాంటి వారి బాధ పడ లేక !*

9. మీరు ఏదైనా సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నారా?

*--కలిగియున్నాను కానీ ఇంకా డబ్బులు కట్ట లేదు. అయితే మీకేంటి? నా కులం గురించి వాకబు చేస్తున్నారా?*

10. అమెరికాలో మీకు ఎవరైన మిత్రులున్నారా ? అక్కడ స్నేహసంబంధాల కోసం తెలపండి?

*----అబ్బే..నాకు మిత్రులున్నారు కానీ. ..వాళ్లకి నేను లేను..అర్థం అవలేదా? ఇంకేం పరిశోధన కొనసాగించండి. ఇక సంబంధాల గురించి ఈ వయస్సులో మాట్లాడడం బావుండదు. పెళ్ళీ, గిళ్ళీ అయిపోయాయి. మన సంగతి ఏమిటీ?*

11. మీరు ఏ విధమైన కోరికలతో అమెరికాకు వెళ్ళారు?

*----కేవలం ఒక సూట్ కేసూ, ఎనిమిది డాలర్లలో వెళ్లాను. కోరికలన్నీ కాకినాడ లో మర్చిపోయాను. ఆ అమ్మాయి ఇపుడు ఎక్కడ ఉందో తెలియదు.*

12. అమెరికా ప్రజల జీవన విధానం పట్ల మీ అభిప్రాయాలు ఎమిటి?

*---అసలు సమస్య ఆంధ్రా, తెలంగాణాలలో జీవన విధానం...అమెరికా గురించి మీకెందుకూ?*

13. అమెరికా ప్రజల పని విధానాలు అలాగే మన తెలుగు ప్రజల పని విధానాలలో తేడాలు తెలపండి?

*----ఒక చోట పరిశోధన చేస్తారు. మరొక చోట పరిశోధన నటిస్తారు. చాలా?*

14. మన ప్రాంతీయత మీద మీ అభిప్రాయాలు?

*------------లేవు.*

15. మీరు మీ భావితరాల వారి జీవితాలను ఏ విధంగా ఉండాలనుకుంటున్నారు?

*-----ఆ విధంగానే ఉండాలి అనుకుంటున్నాను. ఏమిటీ వెధవ ప్రశ్న అని కూడా అనుకుంటున్నాను.*

16. మీరు ఏ విధమైన జాతి పరమైన విభేదాలు అనుభవించారు? అనుభవిస్తే కారణాలు తెలపగలరు?

*------ఈ ప్రశ్న తమరి మోహంలా ఉంది? నేను అబ్బాయిల జాతి పరమైన విభేదాలు అన్నీ అనుభవించాను. లేక పోతే ముగ్గురు పిల్లలు ఎలా పుడతారు?*

17. ప్రవాసాంధ్ర రచయితలు రాసిన రచనలను, మిగతా రచయితలు ఏమైన వాద ప్రతివాదాలు చేసారా?

*--------ఇదేమన్నా మన దేశం అనుకుంటున్నారా? మాకు వాదాలూ లేవు, ప్రతి వాదాలూ లేవు. అంతా సుత్తి మాత్రమే ...సొంత సుత్తి, పర సుత్తి, పరస్పర సుత్తి ....*

18. మీ రచించిన రచనల్లో ముఖ్యమైన అంశాలు ఏమిటి?

*-----------వందల కొద్దీ ఈ- మెయిల్ పేజీలు ఎలా నింపుటా?.*

19. అమెరికా తెలుగు రచయితకు, మనదేశ తెలుగు రచయితలకు తేడాలు తెలపండి?

*----------ఇటువంటి చాలా ఆసక్తికరమైన, అందరి మనసుల్నీ కలిచివేస్తున్న ప్రశ్న అడిగిన మీ మేధాశక్తికి నా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. అదేమిటో, ఎందుకో తెలియదు కానీ నాకు తెలిసీ అక్కడా, ఇక్కడా కూడా కొందరు రచయితలు మగ వారు. మరి కొందరు ఆడవారు. అంత తేడా ఉన్నప్పటికీ అందరూ తెలుగులోనే వ్రాయడం, ఆ విషయాన్ని మీరు మీ నిరంతర పరిశోధన ద్వారా వెలికితీయడం నిజంగా మెచ్చుకోదగ్గ విషయం.*

20. అక్కడ మన ఆహారపు అలవాట్లు ఏలా ఉంటాయి?

*----అదేమిటో తెలియదు కానీ, ఇక్కడ కూడా మన వాళ్ళు కొంతమంది కూరలనీ, జంతువులనీ వండుకుని కానీ, మునీశ్వరుల పద్ధతిలో డైరెక్ట్ గా ఆకులు, అలములూ లాగా నోట్లో కుక్కేసుకోడం కానీ చేస్తూ ఉంటారు. ఈ మధ్య నేను హైదరాబాద్ &*

*ఆంధ్రా వెళ్ళినప్పుడు ఎక్కడ చూసినా పిజ్జా , బర్గర్ తప్ప ఇతర పదార్థములు దొరకవు అని ముందుగానే పసిగట్టి అమెరికా నుంచి మా ఆవిడ పెట్టిన ఆవకాయ, గోంగూర అరడజను పొట్లాలు పట్టుకెళ్లాను.*

21. మన పండుగలు జరుపుకుంటారా ఎలాంటి పండుగలు జరుపుకోవచ్చు?

*--మన సాంప్రదాయం ప్రకారం కొన్ని పండుగలు యధావిధిగానూ, మరికొన్ని మా స్థానిక తెలుగు సంఘం వారి వీలుని బట్టి రెండు, మూడు వారాలు అటు ఇటు గానూ జరుపుకుంటాం. దహన కార్యక్రమం, పదకొండవ రోజు శ్రాద్ధము, తదుపరి ప్రతీ ఏడూ వచ్చి, చచ్చు తద్దినం మొదలైన పండుగలు చనిపోయిన తేదీ తో నిమిత్తం లేకుండా తప్పకుండా వారాంతంలో మాత్రమే జరుపబడును. అప్పుడప్పుడు కేవలం చెడ్డీలు మాత్రమే వేసుకుని పండుగలు చేసుకునే సత్సాంప్రదాయం పాటిస్తాం. కానీ మా అమెరికా ఇల్లాళ్ళు అందుకు విరుద్ధంగా లంగాలు, పట్టు చీరలు చుట్టబెట్టుకుంటారు.*

ఇదంతా అయ్యాక, నాకు అనుమానం వచ్చి, "మీరు దయతో పంపిన ఈ ప్రశ్నావళి గురించి అసలు మీ థీసిస్ ఎడ్వైజర్ గారి కి తెలుసునా.....కొంచెం వివరణ ఇవ్వగలరు." అని ఆ యువకుడి కి ఒక మెయిల్ ఇచ్చాను.

తిరుగు టపాలో వచ్చిన "పరభాగ్యోప జీవి సమాధానం":

"నాకు ఇంగ్లీషు రాదు. అందువలన ఇతర థీసిస్ లలో ఉన్న ఇంగ్లీషు ప్రశ్నలని నేను తెలుగులో తర్జుమా చేసి పంపించాను. తప్పులుంటే సరిచేసి, అందరికీ పంపించి, సమాధానాలు తెప్పించి, నాకు డాక్టరేట్ పట్టా వచ్చే సహాయం చేయండి. అప్పటి దాకా అమెరికా వచ్చే ఆలోచన చెయ్యను. మొత్తం థీసిస్ అయ్యాకనే ఎడ్వైజర్ గారికి చూపించడం మా ఆనవాయితీ. ఆవిడ ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు. మిమ్మల్ని ఎలాగూ పలకరిస్తారు కాబట్టి ఈ ప్రస్తావన తెచ్చి నా కొంప ముంచవద్దు అని సవినయంగా కోరుతున్నాను."

ఇంతలో ఫోన్ మోగింది. "ఇదిగో హస్బెండూ....ఎవరో యూనివర్సిటీలో ప్రొఫెసర్ ట. నీకు అలాంటి గొప్ప వాళ్ళు కూడా తెలుసన్న మాట. ఐ యాం ఇంప్రెస్డ్.." అని ఫోన్ నాకు ఇచ్చింది మా క్వీన్ విక్టోరియా.

**COMMENTS**